మనుస్మృతి ప్రతులు దహనం

మనుస్మృతి ప్రతులు దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

వాంకిడి, డిసెంబర్ 25: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్ ఆవరణలో అంబేద్కర్ సంఘం నాయకులు బుధవారం మనుస్మృతి గ్రంథ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సమాజ్ క్రాంతి అఘాడి రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి దుర్గం, భారతీయ బుద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కార్, భారతీయ బుద్ధ మహాసభ వాంకిడి మండలాధ్యక్షుడు జైరాం ఉప్రే పాల్గొని మాట్లాడారు. మనుస్మృతి అట్టడుగు వర్గాల అభివృద్ధికి అడ్డుగా ఉందన్నారు. కొందరు అగ్రవర్ణాల్లో మనుస్మృతి భావజాలం ఇప్పటికీ ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా ఆర్గనైజర్ విజయ్ ఉప్రే, వాంకిడి మండల అంబేద్కర్ సంఘం ప్రధాన కార్యదర్శి దుర్గం సునీల్‌కుమార్, ఉపాధ్యక్షుడు దుర్గం హంసరాజ్,విలాస్ కోబ్రగడే, మహాత్మా రాజేంద్రప్రసాద్, నాయకులు రోషన్ ఉప్రే, ఆర్ ప్రతాప్, ఖమాన గ్రామ యువజన సంఘం నాయకులు మారుతి, శంకర్, గెడాం హిరిషన్, బౌద్ద ఉపాసకులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి

మందమర్రిలో జీఎం దేవేందర్‌కు రూలింగ్ ట్రోఫీని అందజేస్తున్న డీవైఎస్ఈ శ్రీధర్

మందమర్రి, డిసెంబర్ 25: సింగరేణి మందమర్రి ఏరియాలో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలని ఏరియా జనరల్ మేనేజర్ జీ దేవేందర్ అన్నారు. మందమర్రి ఏరియాకు ఈ ఏడాది సింగరేణి వ్యాప్తంగా నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్ 4.0-2024లో ఏరియాకు నాలుగో ఉత్తమ అవార్డు లభించింది. ఈ నెల 23న కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన సింగరేణి ఆవిర్భావ వేడుకల సెంట్రల్ ఫంక్షన్‌లో సింగరేణి సీఎండీ బలరాం మందమర్రి ఏరియా సివిల్ విభాగం డిప్యూటీ ఎస్ఈ ఎస్ శ్రీధర్‌కు ఉత్తమ అవార్డు రూలింగ్ టోఫీని అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బెస్ట్ ఏరియాగా ఎంపిక కావడానికి కృషి చేసిన అధికారులను అభినందించారు. ఇలాగే ప్రతిభను కనబరచి నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని జీఎం సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ (సివిల్) రాము, ఇన్‌చార్జి పీఎం మైత్రేయబంధు, కేకే డిస్పెన్సరీ సూపరింటెండెంట్ నాగేశ్వర్‌రావు, క్వాలిటీ ఆఫీసర్ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

పూలే అంబేద్కర్ బుద్ధ భూమి నూతన మండల కమిటీని సన్మానిస్తున్న నాయకులు

వాంకిడి, డిసెంబర్ 25: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో పూలే అంబేద్కర్ బుద్ధ భూమి సొసైటీ ఆధ్వర్యంలో వాంకిడి మండల పూలే అంబేద్కర్ బుద్ధ భూమి నూతన మండల కమిటీని బధవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా హిరిషన్ గెడాం, అధ్యక్షుడిగా విజయ్ ఉప్రే, ప్రధాన కార్యదర్శిగా విలాస్ కోబ్రగడే, కోశాధికారిగా మహాత్మా రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడిగా శ్యాంరావు దుర్గె, శంకర్ తాక్‌సాండే ఖమాన, జాడి మొండి కనర్‌గాం, వివిధ గ్రామాల నుంచి సహాయక కార్యదర్శులు, కార్యనిర్వాహక సభ్యులుగా ఎన్నికయ్యారు.

అమ్మకాన్ని రద్దు చేసుకోవాలి

- మాజీ అధ్యక్షుడు రాములు నాయక్

కాసిపేట, డిసెంబర్ 25 : కాసిపేట మండలంలో దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీని బిర్లా కంపెనీ యాజమాన్యం అదానీ గ్రూపునకు పెట్టిన అమ్మకాన్ని రద్దు చేసుకోవాలని ఓరియంట్ కంపెనీ గుర్తింపు సంఘం మాజీ అధ్యక్షులు, ఓరియంట్ సిమెంట్ పర్మినెంట్ వర్కర్స్ లోకల్ యూనియన్ అధ్యక్షులు రాములు నాయక్ డిమాండ్ చేశారు. ఓరియంట్ కార్మికుల సమస్యపై గుర్తింపు సంఘం మాజీ అధ్యక్షులు రాములు నాయక్ తలపెట్టిన 24 గంటల నిరహార దీక్ష బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు నిమ్మరసం అందించి దీక్ష విరమింప చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఓరియంట్ కంపెనీ హెచ్ఆర్ జీఎం కులకర్ణికి అందించారు. కార్యక్రమంలో మాజీ జనరల్ సెక్రెటరీ రొడ్డ రమేశ్, లంబాడా జేఏసీ జిల్లా అధ్యక్షుడు సపాట్ శంకర్, నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, యూనియన్ నాయకులు తత్రభీంరావు తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా సంజీవ్

సంజీవ్

నస్పూర్, డిసెంబర్ 25 : మంచిర్యాల జిల్లా టీపీటీఎఫ్ అధ్యక్షుడిగా పోడేటి సంజీవ్ నియమితులయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మార్స్క్‌భవన్‌లో నిర్వహించిన సమావేశంలో సంజీవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాశం, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

దండేపల్లి, డిసెంబర్ 25: సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందుండాలని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు అన్నారు. దండేపల్లి మండల కేంద్రంలో నిర్మించనున్న క్లబ్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం నాయకపుగూడ గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సభ్యులు సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎస్ శ్రీనివాస్‌రావు, జోన్ చైర్‌పర్సన్ అంజిత్‌రావు, రీజినల్ సెక్రటరీ అనుముల రాజన్న, జోనల్ ట్రెజరర్ జక్కు భూమేశ్, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాదంశెట్టి మల్లికార్జున్, కొండు జనార్దన్, బొలిశెట్టి రాజన్న, కర్నె నరేందర్, గడ్డం రాంచందర్, సత్యం, అప్పాల సునీల్, రమేశ్, బూసిరాజు రాజన్న, శ్రావణ్, సత్యనారాయణ, కుంచె కిషన్, సుగుణాకర్, సత్తయ్య, గంగారాం, తదితరులున్నారు.

కొమ్మెరలో వరి ధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతులు

చిరుజల్లులతో రైతుల ఆందోళన

లింగంపల్లిలో వరి ధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతులు

చెన్నూర్ రూరల్, డిసెంబర్ 25: చెన్నూర్ మండలంలో బుధవారం వాతావరణంలో మార్పులతో రైతులు ఆందోళన చెందారు. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిన కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆకాశం మేఘావృతమైంది. చిరుజల్లులు పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోకుండా రైతులు కవర్లు కప్పారు. భారీ వర్షాలు కురిస్తే ధాన్యం అంతా తడిసిపోతుందని ఆందోళన చెందుతున్నారు. నష్టం వాటిల్లితే ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : క్రిస్మస్ పండుగ సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఫాదర్

మందమర్రి : పట్టణంలోని శ్రీపతినగర్‌లో దివ్యాంగులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న యూత్ ఫెలోషిప్ సభ్యులు

మెర్రీ క్రిస్మస్

- జిల్లాలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 25: జిల్లా వ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ల సందేశాన్ని విన్నారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకొని హ్యాపీ క్రిస్మస్, మేరీ క్రిస్మస్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో క్రిస్మస్ వేడుకల్లో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్ కుమార్ వేడుకల్లో పాల్గొన్నారు. మంచిర్యాల జిల్లా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేంసాగర్‌రావు పలు చర్చిల్లో పాల్గొన్నారు. కాసిపేట మండలంలోని కల్వరీ చర్చిలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ హాజరై క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ జక్కుల శ్వేత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సిర్పూర్(యూ) మండల కేంద్రంలోని చర్చిలో బుధవారం అనాథ పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు. ఆసరా సొసైటీ జిల్లా అధ్యక్షుడు దావునే ప్రకాశ్, రత్నకుమార్ తదితరులున్నారు.

కాసిపేట : కల్వలి మినిస్ట్రీస్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్, పాస్టర్ ప్రవీణ్

సిర్పూర్(యూ) : అనాథలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఆసరా సొసైటీ సభ్యులు

26న రిపోర్టు చేయాలి

నస్పూర్, డిసెంబర్ 25 : ఈ నెల 27న రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే వారు మంచిర్యాల జిల్లా క్రీడాకారులు ఈ నెల 26న జడ్పీహెచ్ఎస్ బాయ్స్ హైస్కూల్ మైదానంలో ఉదయం 9 గంటలకు రిపోర్టు చేయాలని డీవైఎస్వో కీర్తిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల కోసం 9963 539234లో సంప్రదించాలన్నారు.

ఓపెన్ ప్రవేశాలకు తత్కాల్ ద్వారా 30 వరకు గడువు

దండేపల్లి, డిసెంబర్25: 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో ప్రత్యేక ప్రవేశాలు పొందేందుకు తత్కాల్ ద్వారా ఈనెల 30 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని దండేపల్లి ఉన్నత పాఠశాల సమన్వయకర్త ఎన్ శ్రీనివాస్, సహాయ సమన్వయకర్త సంగర్వ్ రాజేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే చివరి అవకాశమని ప్రవేశం పొందే అభ్యాసకులు వారి వారి నిజ ధ్రువీకరణ పత్రాలతో పాఠశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 8309769067 ను సంప్రదించాలన్నారు.

బంగారు తాపడం అందజేత

శ్రీరాంపూర్, డిసెంబర్ 25 : శబరిమల అయ్యప్ప స్వామి మండల పడిపూజా మహోత్సవంలో భాగంగా స్వామి వారికి అలంకరణకు అఖిల భారత అయ్యప ధర్మప్రచార సభ(ఏబీఏపీ)బుధవారం బంగారు తాపడం (అంగీ), నూతన వస్త్రాలు, పండ్లు నీలకల్ శివ మహదేవ టెంపుల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కుట్టన్‌కు ఏబీఏపీ జాతీయ కార్యదర్శి సిరిషెట్టి రాజేష్‌గౌడ్ అందజేశారు. అలాగే తమిలనాడు పీఆర్‌వో మణిస్వామి డైరీ అందించారు. అనంతరం జరిగిన స్వామివారి ఊరేగింపులో ఏబీఏపీ సభ్యులు పాల్గొన్నారని జాతీయ ప్రధాన కార్యదర్శి బేతి తిరుమల్‌రావు పేర్కొన్నారు.

దుప్పట్లు పంపిణీ

రెబ్బెన, డిసెంబర్ 25: మండలంలోని గోలేటి గ్రామంలో బుధవారం అనిల్ యువసేన ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్, ఫౌండేషన్ చైర్మన్ అనిల్‌గౌడ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పస్తం పోశం, నాయకులున్నారు.

యువకుడి ఆత్మహత్య

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 25: మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు అయిడపు రాజ్‌కుమార్ (29) బుధవారం మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం రాజ్‌కుమార్ టాటా ఏసీ వాహనం నడుపుతూ జీవనోపాధి గడుపుతున్నాడు. నాలుగు సంవత్సరాల క్రితం కాగజ్‌నగర్ మండలం బాబాసాగర్‌కు చెందిన లావణ్యతో ప్రేమ వివాహం జరిగింది. రెండు సంవత్సరాల క్రితం భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో లావణ్య తన పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి మనోవేదనకు గురైన రాజ్‌కుమార్ మంగళవారం రాత్రి పట్టణంలోని రాంనగర్‌లో తాను అద్దెకు ఉంటున్న ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం కుటుంబ సభ్యులు ఫోన్ చేసిన ఎంతకీ స్పందించక పోవడంతో గది తలుపులు తీసి చూసేసరికి రాజ్‌కుమార్ ఉరేసుకొని ఉన్నాడు. రాజ్‌కుమార్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోతుల బెడదను పరిష్కరించాలి

బీమారం, డిసెంబర్ 25: బీమారం మండల కేంద్రంలో కోతుల సమస్యను పరిష్కరించాలని యువకులు బీమారం ఎస్ఐ శ్వేతకు దరఖాస్తు సమర్పించారు. ఎస్ఐ శ్వేత బుధవారం పారెస్ట్ అధికారులను పిలిపించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు రిహాబిటేషన్ సెంటర్‌లో ఉన్న కోతులకు గర్భనిరోధక ఇంజక్షన్లు వేయించడం ఒక్కటే శాశ్వత మార్గమని ఎఫ్ఆర్వో శివ తెలిపారు. కోతులకు ఆహారం అలవాటు చేయడంతో కోతులు అటవీ ప్రాంతాలను వదిలి జనావాసాలకు అలవాటు పడుతున్నాయని తెలిపారు. గ్రామ యువత ముందుకు వచ్చి ఇంటింటికీ డబ్బులు జమచేసి కోతులు పట్టించడం గొప్ప విషయమని ఫారెస్ట్ అధికారులు, ఎస్ఐ శ్వేత యువకులను అభినందించారు.

యువతి అదృశ్యం

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 25: మంచిర్యాల జిల్లా కేంద్రం లక్ష్మీనగర్‌కు చెందిన తిరుపతి కూతురు అదృశ్యమైందని పట్టణ సీఐ ప్రమోద్ రావు బుధవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం, మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులందరూ పడుకున్నట్లు బుధవారం ఉదయం 4 గంటల సమయంలో నిద్రలేచి చూసేసరికి తన కూతురు కనిపించకుండా ఎటో వెళ్లిపోయిందని కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. అలాగే ఊరు రామకృష్ణపూర్‌కు చెందిన సింగతి అఖిల్‌తో గతంలో ప్రేమ కొనసాగినట్లు, ఈ విషయంలో గొడవలు కూడా జరిగినట్లు తెలిపారు. అతనిపై అనుమానం ఉన్నదని ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

నేడు జీవీటీసీలో రక్తదాన శిబిరం

మందమర్రి, డిసెంబర్ 25: సింగరేణి మందమర్రి ఏరియాలోని గనుల వృత్తి శిక్షణ కేంద్రం(జీవీటీసీ)లో గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జీవీటీసీ మేనేజర్ శంకర్, రెడ్‌క్రాస్ సొసైటీ బెల్లంపల్లి సబ్ డివిజన్ సభ్యుడు సూరం లక్ష్మీనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన కార్మికులతోపాటు ఏరియాలోని వివిధ గనుల కార్మికులు, యువకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేసి తలసేమియా వ్యాధిగ్రస్థులకు అండగా నిలవాలని కోరారు.

గుండెపోటుతో యువకుడి మృతి

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 25: మండలంలోని బూరుగూడ గ్రామానికి చెందిన మేకర్తి యుగేందర్ (39) గుండెపోటుతో మంగళవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం యోగేందర్ రోజులాగే వ్యవసాయ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చి భోజనం చేసి పడుకునే సమయంలో ఒక్కసారిగా గుండెనొప్పి వచ్చింది. దీంతో వెంటనే కుటుంబీకులు ఆసిఫాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకొని వెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. యుగేందర్‌కు భార్య, కుమారుడు, కూతురున్నారు.

టోకెన్ సమ్మెను జయప్రదం చేయండి

రెబ్బెనలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

రెబ్బెన, డిసెంబర్ 25: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27, 28 తేదీల్లో జరిగే టోకెన్ సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. రెబ్బెన మండల కేంద్రంలో బుధవారం మాట్లాడుతూ, తెలంగాణ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని, జీవో నెంబర్ 51ని సవరించి, తదితర సమస్యలపై టోకెన్ సమ్మె నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, వెంకటేశ్, దేవాజీ, ప్రవీణ్, సునీల్, శేఖర్ తదితరులున్నారు.

మస్టర్ల కోతపై న్యాయ పోరాటం

మందమర్రి కేకే 5 గనిపై కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రి, డిసెంబర్ 25: ఆడిట్ పేరుతో కార్మికుల మస్టర్‌ను కట్‌చేసి వేతనాల్లో కోత విధించడంపై అవసరమైతే కోర్టుకు వెళ్లి న్యాయ పోరాటం చేస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకే 5గనిపై బుధవారం మొదటి షిఫ్టులో యూనియన్ నాయకులతో కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కంపెనీ అవసర రీత్యా సర్ఫేస్‌లో పనులకు కేటాయించిన కార్మికులు ల్యాంప్‌రూమ్‌లో లైట్స్ తీసుకుని విధులు నిర్వహిస్తే వారికి చార్జిషీట్లు జారీ చేయడం, మస్టర్లను కట్ చేయడం చట్ట విరుద్ధమన్నారు. అలాగే అండర్ గ్రౌండ్‌లో ఓ కార్మికుడు విధులు ముగించుకుని అవుట్ పడిన తరువాత అతని మస్టర్‌ను కట్ చేయమని లెటర్ ఇచ్చారన్నారు. ఇటీవల ఏరియా స్టోర్‌లో ఐదుగురు కార్మికులు లంచ్‌కు వెళ్లి ఐదు నిమిషాలు ఆలస్యంగా రాగా వారికి చార్జిషీట్ ఇచ్చారని ప్రొఫెషనల్ వేజెస్‌కు బదులు ఫుల్ వేజెస్ కట్ చేయడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. దీనిపై యాజమాన్యం స్పందించి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని లేనిపక్షంలో కోర్టుకు వెళ్లి న్యాయ పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్, సహాయ కార్యదర్శి సోమిశెట్టి రాజేశ్, జాయింట్ సెక్రటరీ కంది శ్రీనివాస్, ఆంటోని దినేశ్, ఫిట్ కార్యదర్శి గాండ్ల సంపత్, ప్రేమ్‌లాల్, బానోతు నాగేశ్వర్‌రావు, శ్రీకాంత్, భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిర్దావర్లపై దాడి హేయమైన చర్య

- టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి

హాజీపూర్, డిసెంబర్ 25 : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాప్రా మండలంలో గిర్దావర్ల పై దాడి హేయమైన చర్య అని తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవోస్) ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో భాగంగా విధులు నిర్వహిస్తున్న కాప్రా మండల గిర్దావర్లు సాయి, రమేశ్‌పై కొందరు దాడి చేయడం హేయమైన చర్య అని నిందితులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలన్నారు. లగచర్ల, దిలావర్ పూర్ ఘటనలు మరువకుముందే ఇలాంటి సంఘటనలు పురావృత్తం కావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం వ్యవహరించే ఉద్యోగులపై దాడులు చేయడం భావ్యం కాదన్నారు. దాడి చేసిన వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడ జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శి పొన్న మల్లయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, ఉపాధ్యక్షుడు కుర్మాచలం శ్రీనివాస్, రామ్‌కుమార్, తిపరుతి, అంజయ్య, సంయుక్త కార్యదర్శి సునీత, ప్రభు, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలి

వెంకటాపూర్ చెక్‌పోస్టు వద్ద రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ కమలాకర్

కౌటాల, డిసెంబర్ 25 : చెక్ పోస్టుల వద్ద తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని సిర్పూర్(టి) ఎస్ఐ కమలాకర్ అన్నారు. బుధవారం మండల సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రతి వాహన వివరాలను నమోదు చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు.

యథేచ్ఛగా వనమేధం

- ఖానాపూర్ అడవుల్లో పదిటేకు చెట్లు నరికిన స్మగ్లర్లు

దుంగలుగా చేసి తరలించేందుకు సిద్ధంగా ఉన్న టేకు కలప

ఖానాపూర్, డిసెంబర్ 25: నిర్మల్ జిల్లా ఖానాపూర్-నిర్మల్ ప్రధాన రహదారికి 100 మీటర్లు దూరంలో కలప స్మగ్లర్ల గొడ్డలి వేటుకు 30 ఏండ్లపై బడిన పది భారీ టేకు వృక్షాలు కుప్పకులాయి. స్థానికులు, అధికారులు, బడ నాయకుల అండదండాలతో స్మగ్లర్లు విలువైన టేకు చెట్లను యథేచ్ఛగా నరికి వేసి కలపను తరలించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ప్రచారం జోరుగా జరుగుతుంది. ఖానాపూర్ బీట్ పరిధిలో అడవులను కాపాడాల్సిన బీట్, సెక్షన్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో స్మగ్లర్లకు అడ్డు అదుపు లేకుండా పోయిందన్న విమర్శలు తలెత్తుతున్నాయి. కవ్వాల్ అటవీ సంపద సంరక్షణలో సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా మారుతుంది. విధులపై నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఐదు రోజుల క్రితం ఖానాపూర్ బీట్ పరిధిలో ఇష్టారాజ్యంగా నరికిన టేకు చెట్లే ఇందుకు నిదర్శనం. జాతీయ రహదారి పక్కన నుంచి రెండు సార్లు జోరుగా కలప దందా జరగడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

రెండు సార్లు నరికివేతకు గురి..

ఖానాపూర్ మండలంలోని తర్లపాడు గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో స్మగ్లర్లు ఈ నెల 14, 18న రెండు సార్లు కోత యంత్రాలతో గుట్టు చప్పుడు కాకుండా పది భారీ వృక్షాలను నేలమట్టం చేసి ఆరు దుంగాలను తరలించినట్లు అధికారులు వెల్లడించారు. స్మగ్లర్లు నరికి వదిలేసిన దుంగాలకు అటవీ శాఖ సిబ్బంది మార్కింగ్ వేసి ఖానాపూర్ అటవీ శాఖ కలప డిపోకు తరలిస్తున్నారు. స్థానిక ఎఫ్‌బీవో ముత్యంను వివరణ కోరగా తాను పాత తర్లపాడుతో పాటు ఎక్బాల్‌పూర్, ఖానాపూర్ అటవీ పరిధికి ఇన్‌చార్జిగా ఉండడంతో పని భారంతో ఇలాంటి సంఘటన చోటు చేసుకుందని వివరించారు. జాతీయ రహదారికి అతి సమీపంలో భారీ వృక్షాలు కోతకు గురికావడంతో మండలంలో చర్చనీయాంశంగా మారింది. అధికారులు విధులు నిర్వహిస్తున్నారా లేదా అన్న ఆపోహాలు తెరపైకి వస్తున్నాయి.

చెట్ల నరికివేతపై చర్యలు తీసుకుంటాం

ఖానాపూర్ బీట్ పరిధిలో టేకు చెట్ల నరికివేతపై తగిన చర్యలు తీసుకుంటాం. అటవీ సంపద కాపాడేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటివరకు కలప తరలింపునకు పాల్పడ్డ నలుగురి వ్యక్తులను గుర్తించాం. సెల్‌ఫోన్ నెట్ వర్క్ ద్వారా నిందితులను గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నాం. టేకు చెట్లు నరికిన వారిని గుర్తించి కేసు నమోదు చేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కలప దొంగలను త్వరలోనే పట్టుకుంటాం. కలప స్మగ్లింగ్‌కు పాల్పడితే ఎంతటివారైన ఉపేక్షించేది లేదు.

-కే కిరణ్, ఎఫ్ఆర్‌వో, ఖానాపూర్